TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 228 | గురువారం 24-04-2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత విజయవాడలో మీడియాతో మాట్లాడారు.
- తెదేపా హయాంలో ఎవరూ ఇబ్బంది పడలేదని, అధికారులు సురక్షితంగా పనిచేశారని తెలిపారు.
- వైకాపా అధికారంలో ఉన్న సమయంలో తప్పుడు పనులు చేసిన అధికారులే ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
- ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్ నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు.
- తెదేపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమపై అనేక కేసులు నమోదైనప్పటికీ, అధికారులపై ఒత్తిడి తేవలేదని చెప్పారు.



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. భాజపాకు పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది.

భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారని కాసం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

## హైడ్రా లోగో మారింది.. కొత్త లోగో ఇదే..!




2లో

## జనరల్ మజ్దూర్‌లు ఇక జనరల్ అసిస్టెంట్లు.. కీలక ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం



2లో

## తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్ లా మారింది: కేటీఆర్




రెండున్నర దశాబ్దాల కాలంలో తెలుగు రాష్ట్రాల్లో రెండే పార్టీలు మాత్రమే నిలదొక్కుకున్నాయని ... అందులో ఒకటి బీఆర్ఎస్ పార్టీ అని కేటీఆర్ అన్నారు. భారతదేశంలో ఎన్నో పార్టీలు పుట్టి.. మాయమమయ్యాయన్నారు. తెలంగాణ భవన్ ఇప్పుడు జనతా గ్యారేజ్ లాగా మారిందని ఆయన తెలిపారు. బాధితులుకు కేవలం గులాబీ జండా మాత్రమే అండగా ఉంటుందని... వరంగల్ గడ్డపై బీఆర్ఎస్ సభలు చరిత్ర సృష్టించాయన్నారు. 40 వేల వాహనాలకు పార్కింగ్ తోపాటు.. 10 లక్షల వాటర్ బాటిల్స్.. 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేశామన్నారు. కాంగ్రెస్ గవర్నమెంట్ లో కరెంట్ మీద నమ్మకం లేకనే.. సభ కోసం 200 జనరేటర్లు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. పేజి 2లో

## ఆదిలాబాద్ జిల్లా: ఘోర అగ్ని ప్రమాదం..రూ. పది లక్షల ఆస్తినష్టం



ఆదిలాబాద్? జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. తాంసి మండలం కప్పర్లలో ఓ పశువుల కొట్టం దగ్ధమైంది. పశువుల కొట్టంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కాలి బూడిద అయింది. దీని పక్కనే రెండు మాక్సక్ష వాహనాలుండగా వాటికి నిప్పంటుకొని కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో 10 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు మంటలార్పారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు బాధితులు కోరుతున్నారు.

# బాధిత కుటుంబాలకు ఓదార్పు

## అండగా ఉంటామన్న అమిత్ షా



పహల్గామ్ బాధిత కుటుంబాలతో శ్రీనగర్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంతకముందు పహల్గామ్ మృతుల భౌతికకాయాలకు అమిత్ షా నివాళులర్పించారు. అమిత్ షా.. పహల్గామ్ సంఘటనాస్థలిలో పర్యటించారు. అమిత్ షా వెంట జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉన్నారు. ఇక భద్రతా దళాలు ఆ ప్రాంతాలను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అంతేకాకుండా ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో దాదాపు 8-10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నట్లుగా గుర్తించారు. వీరిలో 5-7 మంది ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందినవారని అనుమానిస్తున్నట్లు- సమాచారం. దాడి చేసింది తామేనని ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీ-ఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ ఉగ్రవాదులంతా కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలు, పిల్లల్ని ఏమి చేయలేదు. వారి జోలికి కూడా రాలేదు. ఒకవేళ అడ్డొచ్చినా.. ఏమీ చేయలేదు. పేజి 2లో

## ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్.. ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య

హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు నిన్న విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. తీవ్ర మనస్తాపానికి గురై ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని, వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థినికి తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ విద్యార్థిని అశ్వితగా గుర్తించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) ప్రథమ సంవత్సరం చదివాడు. పరీక్షలో ఫెయిల్ కావడంతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పేజి 2లో



## కాశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయం చేసే కుట్ర



2లో

## ఉగ్రమూకలు సైనికి దుస్తుల్లో వచ్చి కాల్పులు

- సైన్యాన్ని చూసి వణికిపోయిన బాధితులు
- పోల్చుకోలేక వదిలిపెట్టమని ప్రాధేయపడిన ఇల్లాలు
- బాధితులకు అండగా ఉంటామన్న హోంమంత్రి



2లో

## ఉగ్రదాడిలో నేవీ అధికారి మృతి..
## కలచివేస్తోన్న నవవధువు కన్నీటి వీడ్కోలు



నిండు నూరేళ్ల జీవితాన్ని పంచుకోవాలని.. కోటి ఆశలతో అత్తవారింట్లో అడుగుపెట్టిన నవ వధువుకు ఉగ్రదాడి తీరని శోకాన్ని మిగిల్చింది. పెళ్లై వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. ఎవరిని నిందించినా తన జీవితం తనకు తిరిగిరాదని.. భర్తకు తుది వీడ్కోలు పలుకుతూ ఆమె రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. ఇంతటి విషాదంలోనూ ఎంతో గర్వంగా సెల్యూట్ చేస్తూ తన భర్తను సాగనంపుతున్న తీరు మెలిపెడుతోంది.
హరియాణాకు చెందిన 26 ఏళ్ల లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహాన్ని నేటి ఉదయం దిల్లీకి తరలించారు. వినయ్‌కు ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న ఆమెను చూస్తూ అక్కడున్న వారంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. పుట్టెడు దుఃఖంలోనూ భర్త మరణం పట్ల గర్వపడుతూ సాగనంపారామె. “ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అతడి వల్లే మేమింకా ప్రాణాలతో ఉన్నాం. నా భర్త మరణం పట్ల నేనెంతో గర్వపడుతున్నా” అని వినయ్ నర్వాల్ భార్య అన్నారు.

**వీసాలు రిజెక్ట్ కావడంతో..**

ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. నర్వాల్ రెండేళ్ల క్రితమే నౌకాదళంలో చేరారు. కేరళలోని కోచిలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఏప్రిల్ 16న వివాహమవగా.. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ నవ జంట.. తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్‌కు వచ్చింది.
ఈ క్రమంలోనే మంగళవారం పహల్గాంలో సైనిక దుస్తువుల్లో వచ్చిన ఉగ్రవాదులు పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. అమాయకుల ప్రాణాలు తీసి వారి ఉసురు పోసుకున్నారు. ఈ దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు ప్రాణాలతో తప్పించుకున్నారు. ఈ మారణహోమాన్ని ప్రత్యక్షంగా చూసిన మృతుల కుటుంబాల బాధ వర్ణనాతీతం. అసలైన సైనికులను చూసినా భయంతో వణికిపోతున్నారు.

## ఉగ్ర రక్కసిపై గళమెత్తిన కశ్మీర్..
## ఆరేళ్లలో తొలిసారి బంద్!

ఉగ్ర రక్కసికి జమ్మూ కశ్మీర్ మరోసారి ఉలిక్కిపడింది. పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడితో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దీంతో శ్రీనగర్ సహా స్థానికంగా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. తాజా ఘటనతో కశ్మీరీలు సిగ్గుతో తల దించుకుంటున్నారని అన్నారు. అటు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా లాల్‌చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టింది.



**ఆరేళ్లలో తొలిసారి..**

రాజకీయ పార్టీలు సహా అన్ని వర్గాల ప్రజలు ఉగ్ర చర్యలను ఖండిస్తూ నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీనగర్ సహా అనేక చోట్ల బంద్ పాటించారు. కశ్మీర్ ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీశారని ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఇటీవలి కాలంలో దుకాణాలు మూతపడటం ఇదే తొలిసారి. ఆగస్టు 2019కు ముందు ఇక్కడ ఇటువంటివి సర్వసాధారణం కాగా.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, గత ఆరేళ్లలో కశ్మీర్‌లో బంద్ పాటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.
“ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకూడదు. కశ్మీర్ పేరుతో, ఏదైనా వర్గం పేరుతో ఇలాంటివి మరోసారి జరగకూడదు. అమాయకుల ప్రాణాలు తీయడం అంటే మొత్తం మానవాళినే చంపడంతో సమానం” అని హాజీ బాషిర్ అహ్మద్ అనే శ్రీనగర్ వాసి మీడియాతో పేర్కొన్నాడు. వీలైనంత త్వరగా ఉగ్రవాద మూలాలను పెకిలివేసేలా చర్యలు చేపట్టాలని స్థానిక పండ్ల వ్యాపారి జీఎం బాండే పేర్కొన్నాడు. కశ్మీరీ ప్రజలు ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమేనన్నాడు. అయితే, కశ్మీరీ సమాజాన్ని కించపరచడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం ఏం చర్య తీసుకున్నా తాము మద్దతు ఇస్తామన్నారు.

**ప్రపంచానికి సందేశం చాటేందుకే..**

ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హంద్వారాలో నిరసనలు చేపట్టారు. ఉగ్ర చర్యకు వ్యతిరేకంగా దక్షిణ కశ్మీర్‌లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. 2016లో హిజ్‌బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమైన తర్వాత ఇదే విధంగా స్థానికులు వీధుల్లోకి వచ్చారు. కశ్మీరీలు ఉగ్రవాదంతో లేరనే సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకే ఈ నిరసనలు చేస్తున్నామని, పర్యటకులపై దాడిని ఖండిస్తున్నామని స్థానిక సామాజిక కార్యకర్త తౌసీఫ్ అహ్మద్ పేర్కొన్నారు.
దాడికి పాల్పడినవారు జమ్మూ కశ్మీర్ ప్రజల మేలు కోరే వారు కాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, శ్రీనగర్ ఎంపీ అగా సయ్యద్ రుహుల్లా మెహ్‌దీ పేర్కొన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టం ముందు నిలబెడుతామన్నారు.
రాంబన్ జిల్లాలోనూ నిరసనలు జరిగాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో విలవిలలాడుతున్నప్పటికీ.. ఉగ్రదాడికి నిరసనగా బంద్ పాటించి శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. ఈ పట్టణ చరిత్రలో తొలిసారిగా హిందూ, ముస్లిం వర్గాలు కలిసి ఉగ్రచర్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని

## ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్..
## ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ మోతీనగర్ సమీపంలోని అవంతినగర్‌కు చెందిన విద్యార్థి బల్కంపేటలోని ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. పరీక్షలో ఫెయిల్ కావడంతో ఆవేదనకు గురై.. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగోలు తట్టిఅన్నారం వైఎస్ఆర్ కాలనీకి చెందిన విద్యార్థిని ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం పరీక్షలు రాసింది. ఒక సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.
బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న సుమతి, రామకృష్ణల కూతురు నిష్ఠ స్థానిక అభ్యాస జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. నిష్ఠ కెమిస్ట్రీలో ఫెయిల్ కావడంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లికి చెందిన విద్యార్థిని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తాను అనుకున్న స్థాయిలో మార్కులు రాలేదని ఆత్మహత్యకు పాల్పడింది.

## కాశ్మీర్ వివాదాన్ని
## అంతర్జాతీయం చేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి

**వాన్స్ పర్యటనలో ఉండగా ఉగ్రదాడి**

**క్లింటన్ పర్యటన సమయంలోనూ ఇదే తరహా ఘటన**

జమ్మూ కాశ్మీర్ వివాదాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెలియజేసేందుకే విదేశీ అతిథుల భారత పర్యటనలో ఉండగానే ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉండటం.. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ భారత్‌లో పర్యటన కొనసాగుతున్న సమయంలో పహల్గాం దాడి జరగడం గమనార్హం.
అయితే, ఇలాంటి ఘటన సుమారు పాతికేళ్ల క్రితం జరిగింది. అంటే, 20 మార్చి 2000వ సంవత్సరంలో అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పొరలో ఉగ్రవాదులు సుమారు 36 మందిని చంపేశారు. నాడు సిక్కు కమ్యూనిటీలోని వారే ఉగ్రవాదులకు టార్గెట్ అయ్యారు. వాస్తవానికి అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ న్యూ ఢిల్లీ పర్యటనలో ఉండగా.. అప్పుడు జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే లక్ష్యంతోనే పాకిస్థాన్ ఈ దాడికి పాల్పడినట్లు- అందరు భావించారు. కాగా, నాడు ఉగ్రమూకలు భారీ తుపాకులు, రెండు సైనిక వాహనాల్లో ఛత్తీసింగ్‌పొర గ్రామంలోకి చొరబడి.. ఇంటింటికీ తిరిగి తమను సైనిక సిబ్బందిగా చెప్పుకొని.. తనిఖీల నిమిత్తం పురుషులు అందరు బయటకు రావాలని ఆదేశాలు జారీ చేశారు.. ఆ తర్వాత వారందరినీ గురుద్వారా దగ్గర ఉంచి కాల్చి చంపేశారు. దీంతో భారత సైన్యమే ఆ పని చేసిందన్నట్లు- అక్కడిని వారిని ఈ ఉగ్రవాదులు నమ్మించేలా నినాదాలు కూడా చేశారు. కానీ, చివరికి దర్యాప్తు సంస్థలు పాక్ ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు తేల్చాయి. కాగా, ఇప్పుడు.. పహల్గాంలో ఉగ్ర దాడికి.. గతంలో జరిగిన ఛత్తీసింగ్‌పొర నరమేధానికి చాలా దగ్గరి సంబంధాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం భారత్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటు-ంబంతో కలిసి పర్యటిస్తున్నారు. మరోవైపు భారత ప్రధాని మోడీ సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఇదే సరైన సమయంగా భావించిన ఉగ్రవాదులు ఇండియన్ ఆర్మీ దుస్తుల్లో వెళ్లి పహల్గామ్‌కు వచ్చిన పర్యటకుల మతంతో పాటు ఐడీలను పరిశీలించి మరీ దాడి చేశారు. హిందువులనే టార్గెట్ గా చేసుకుని చంపేయడం గమనార్హం.

## ఉగ్రమూకలు సైనికి
## దుస్తుల్లో వచ్చి కాల్పులు

మొదటిపేజీ తరువాయి



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం సమీప బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడులు చేయడంతో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రూరమైన దాడిలో బయటపడిన బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఉగ్రదాడి సమాచారం అందుకున్న సైనికులు ఘటనా
స్థలానికి వెళ్లి.. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా అక్కడ ఉన్న పర్యటకులు.. వారు కూడా ఉగ్రవాదులే అనుకొని భయంతో వణికి పోయారు. సైనికుల దుస్తుల్లో రావడం వల్ల పర్యాటకులు ముందుగా ప్రమాదాన్ని గుర్తించలేదు. అందుకే సాయం చేయడానికి వచ్చిన అసలు భారత సైపనికులను చూసి కూడా వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ ఆర్మీ దుస్తుల్లో తమపై దాడి చేయడానికి వచ్చారేమో అనుకొని సైనికులను చూసిన ఓ మహిళ తన చిన్నారిని ఏమీ చేయొద్దని బోరున విలపిస్తూ.. చేతులు జోడించి వారిని వేడుకుంది. ఇతర పర్యటకులు కూడా భయంతో తమ పిల్లలను దాచడానికి ప్రయత్నించారు. ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్తూ.. తాము భారత ఆర్మీ నుంచి.. మిమ్మల్ని రక్షించడానికే ఇక్కడికి వచ్చామని భరోసా ఇచ్చారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఉగ్రవాద దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఆ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని.. ఆ బాధలో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు పేర్కొన్నాయి. కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత
దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ’లష్కరే తయ్యిబా’ అనుబంధ విభాగం ’ద రెసిస్టెన్స్ ఫ్రంట్’ ఈ మారణహోమానికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తుపాకులు ఎక్కుపెట్టి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడి చేశారు. 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాల్పుల శబ్దం విని అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టాయి. ప్రధాని మోదీ సూచన మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## బాధిత కుటుంబాలకు ఓదార్పు



మొదటిపేజీ తరువాయి

ఇక ముస్లిమా కాదా అని వివరాలు అడిగి తెలుసుకున్నాకే కాల్చారు. ఐడీ కార్డులో పేరు చూసి మరీ కాల్చేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 28 మంది మరణించారు. యూఏఈ, నేపాల్‌కు చెందిన ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఈ ఉగ్ర దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు అండగా ఉంటామని అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ ప్రకటించాయి. ఇక సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. ఉగ్ర దాడి వార్త తెలుసుకున్న వెంటనే హుటాహుటినా భారత్‌కు బయల్దేరి వచ్చేశారు. బుధవారం అత్యవసర కేబినెట్ సమావేశానికి పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

## తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్ లా మారింది: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ప్రభబండ్లతో సభకు బయలు దేరినవారు ఉద్యమ స్ఫూర్తిని చాటుతున్నారంటూ.. రెండు వేల మంది వాలంటీర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. BRS చరిత్రలో ఇదొక అతిపెద్ద సభగా నిలువబోతుందంటూ.. KCR ను చూడాలి.. ప్రసంగం వినాలని జనం తాపత్రయం తో ఉన్నారని కేటీఆర్ అన్నారు.
ఏప్రిల్ 27 వ తేది సాయంత్రం 4.30 నిమిషాలకు కేసిఆర్ సభా ప్రాంగణానికి చేరుకుంటారని.. 5.30 నిమిషాలకు ఆయన ప్రసంగం ఉంటుందని తెలిపారు. అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలన్నారు. కొంతమంది బీఆర్ఎస్ సభకు మరకలు అంటించడం కోసం కొందరు చిల్లర ప్రయత్నాలు చేస్తున్నారు అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కౌశిక్ రెడ్డి పై కేసు కూడా అలాంటి ప్రయత్నమేనని కేటీఆర్ అన్నారు.

## హైడ్రా లోగో మారింది..
## కొత్త లోగో ఇదే..!

మొదటిపేజీ తరువాయి

హైడ్రా లోగో మారింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజన్సీ లోగోను తెలంగాణ ప్రభుత్వం మార్చింది. వాటర్ వర్ఫ్ సూచించేలా కొత్త లోగోను రూపొందించారు. గతంలో గ్రాన్డియర్ లుక్ లో పాత లోగోఉంది. హైడ్రకార్యాలయం.. వాహనాలు, సిబ్బంది యూనిఫాంపై కొత్త లోగో ఉంటుందని హైడ్రా అధికారులు తెలిపారు. హెచ్ అక్షరంపై నీటి బొట్టుతో హైడ్రా లోగో రూపకల్పనచేశారు.
ప్రస్తుతం ఈ కొత్త లోగోనే హైడ్రా తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ హ్యాండిల్ కు డీపీగా ఉపయోగించింది. హైదరాబాద్ నగరంలోని ప్రజలను విపత్తుల నుంచి రక్షించందుకు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్ర సంస్థగా హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## జనరల్ మజ్దూర్‌లు ఇక జనరల్ అసిస్టెంట్లు.. కీలక ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం



మొదటిపేజీ తరువాయి

సింగరేణి సంస్థలోని కేటగిరి-1లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై జనరల్ అసిస్టెంట్‌గా గుర్తించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వేజ్ బోర్డు ఒప్పందం మేరకే ఈ పేరు మార్చాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సర్క్యులర్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులపై సింగరేణిలోని 14 వేల మంది జనరల్ మజ్దూర్లతో పాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
ఇప్పటివరకు సింగరేణి సంస్థలోని కేటగిరీ-1లో పనిచేసే వారిని జనరల్ మజ్దూర్ అని పిలవడం అలవాటుగా వస్తుంది. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు, కూలీ అని అర్థం. సింగరేణి సంస్థలోనే కాకుండా కోల్ ఇండియాలో కూడా కింది స్థాయి ఉద్యోగులను ఇదే పేరుతో పిలుస్తూ వస్తున్నారు. బొగ్గు తవ్వకం తొలి రోజుల్లో గుత్తేదారులే యజమానులుగా ఉంటుండేవారు. బొగ్గు తవ్వడం కోసం పల్లె ప్రాంతం నుంచి కూలీ(మజ్దూర్)లను తీసుకొని వస్తుండేవారు. కాలక్రమంలో బొగ్గు గనులు జాతీయాకరణ జరిగిన తర్వాత ఈ మజ్దూర్‌లను అన్ని రకాల శారీరక శ్రమకు సంబంధించిన పనులకు వినియోగిస్తుండేవారు. అందుకే వీరిని జనరల్ మజ్దూర్‌లుగా గుర్తించారు.
గతంలో కేవలం నిరక్షరాస్యులు మాత్రమే జనరల్ జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తుండేవారు. కానీ నేడు కారుణ్య నియామకాల్లో భాగంగా ఉన్నత చదువులు చదివిన వారు కూడా తొలుత బదిలీ వర్కర్లుగా ఎంపికై ఏడాది తర్వాత జనరల్ మజ్దూర్లుగా గుర్తించబడుతున్నారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో జనరల్ మజ్దూర్లు కూడా కీలకంగా ఉంటున్నందువల్ల, వీరి వృత్తికి కూడా సముచిత గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ అనే పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్‌గా మార్పు చేశారు. ఈ మార్పును వెంటనే అమలు చేసిన సీఎండీ బలరామ్‌కు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పండుగ వాతావరణాన్ని తలపించిన రైతు మహోత్సవం వేడుక









**- ఆధునిక సాగుపై సలహాలు, సూచనలు అందించిన శాస్త్రవేత్తలు, నిపుణులు**

**- విశేషంగా ఆకట్టుకున్న వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్లు**

**- కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్ల సందర్శన**

నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 23 :
రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవం వేడుక బుధవారం సాయంత్రం నాటితో ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేయగా, నిజామాబాద్ తో పాటు కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల ఐదు జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130 కు పైగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను, ఆధునిక సాగు పరికరాలు, అధిక దిగుబడులను అందించే వంగడాలు, మేలు జాతి పాడిపశువులు తదితర వాటిని స్టాళ్లలో ప్రదర్శించగా, రైతులు ఎంతో ఆసక్తితో తిలకించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ, ఇతర వ్యవసాయ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు మూడు రోజుల పాటు కొనసాగిన వర్క్ షాపులో ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఏ.జానయ్య, వివిధ విభాగాల అధిపతులు శ్రీలత, అంజయ్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకృష్ణ, శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, రాజశేఖర్, విజయ్, స్వప్న తదితరులు వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన మెళుకువలు, సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, భూసారం పెంపుదల, అధిక దిగుబడులను అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను సాధించేందుకు అవలంభించాల్సిన పద్ధతులు, వాణిజ్య పంటల ఎంపికకు పరిశీలించాల్సిన అంశాలు తదితర విషయాలపై సెషన్ల వారీగా రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు సైతం రైతు మహోత్సవం వేదిక ద్వారా తమ అనుభవాలు పంచుకున్నారు.

**స్టాళ్లను సందర్శించిన కలెక్టర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు :-**

కాగా, చివరి రోజైన బుధవారం జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు రైతు మహోత్సవ వేదిక, స్టాళ్లను సందర్శించారు. రైతులు, రైతు ప్రతినిధులతో మమేకం అయ్యి మూడు రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమం గురించి వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మహోత్సవ వేడుక నిర్వహించడం పట్ల హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. సాగు విషయాలలో అనేక నూతన విధానాలు, సరికొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకోగలిగామని, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలైన అభ్యుదయ రైతుల అనుభవాలతో పాటు వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, సైంటిస్టులు, నిపుణులు తమ పరిశోధనా అనుభవాలను, నేటి సామాజిక వ్యవసాయక స్థితిగతులను మేళవిస్తూ అనేక అంశాలపై అవగాహన కల్పించారని, పంటల సాగులో నూతన ఒరవడికి, అధిక దిగుబడుల సాధనకు ఈ మేళా ఎంతగానో దోహదపడుతుందని గట్టి నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలో రైతు మహోత్సవ వేడుక నిర్వహించడం వల్ల స్థానిక రైతులతో పాటు జిల్లాకు అనుకుని ఉన్న కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల రైతులకు కూడా ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు, సామాజిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాగు రంగంలో మెళకువలు, యాంత్రీకరణ తదితర అంశాలపై సైంటిస్టులు, నిపుణులు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అభ్యుదయ రైతులు వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు అనుబంధ రంగాల ఉత్పత్తులకు సంబంధించిన సుమారు 130 కు పైగా స్టాళ్లను రైతులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ, ప్రయోగాత్మక పరిశీలన ద్వారా అవగాహనను పెంపొందించుకోగలిగారని కలెక్టర్ తెలిపారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను, నూతన సాగు విధానాల గురించి రైతులు గ్రామాలలో సహచర రైతులకు తెలియజేస్తూ వారిని కూడా అధిక దిగుబడుల సాధన దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ రైతు మహోత్సవానికి ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచామని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే భూ భారతి

**- అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 23 :**
రైతుల భూములపై వారికి పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తెచ్చిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఈ క్రమంలో ఎవరికైనా భూ సంబంధిత సమస్యలు ఉంటే వాటిని భూభారతి ద్వారా పరిష్కరించేందుకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, తద్వారా రైతులకు భూములపై పూర్తి భరోసా లభిస్తుందని అన్నారు. భూభారతి (భూమి హక్కుల రికార్డు ) చట్టం-2025 పై బుధవారం చందూర్, మోస్రా మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొని, రైతులకు ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రజల కోసం ప్రత్యేకించి రైతులకు వారి భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే వాటిని తొలగించి, భూములపై పూర్తి హక్కులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని అన్నారు. ధరణిలోని వివరాల ప్రకారం భూభారతి రికార్డులలో వాటిని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే, రైతులు తమ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అర్జీలు అందించవచ్చని సూచించారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. కానీ ప్రస్తుత భూభారతి చట్టం కింద భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీఓకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలు మండల స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ ఉండడం వల్ల ఏ మాడ్యూల్ కింద దరఖాస్తు చేయాలన్నది తెలియక ఒకింత ఇబ్బందులు పడేవారని, భూభారతిలో కేవలం నాలుగు మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన పద్ధతిలో దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని అన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని, ఇదివరకటి ధరణిలో ఇలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని కోణాలలో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులు అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో అప్పీల్ వ్యవస్థ ఉందని, అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు. ఈ. చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన ఆధార్ తరహాలో భూధార్ సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. భూ సమస్యలు తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు. భూ వివరాలతో పాటు భూమి హద్దులతో కూడిన సర్వే మ్యాప్ పట్టా పాస్ పుస్తకానికి జత చేయబడుతుందని సూచించారు. అసైన్ మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు. అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. భూభారతి చట్టంలో ఇంకా ఎలాంటి అంశాలు చేరిస్తే బాగుంటుందనే దానిపై రైతులు సలహాలు, సూచనలు చేయవచ్చని సూచించారు. ఈ సదస్సులలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి వేణు



**గొల్లపల్లి (మన వెలుగు) ఏప్రిల్ 23 :**
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం తిరుమలపురం (పిడి) గ్రామంలో నంచర్ల సింగిల్ విండో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ మంత్రి వేణు బుధవారం ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి, అమ్మి మోసపోవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుంది అన్నారు. వరి ధాన్యం క్వింటాలుకు ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బి గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2300 మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు పండించిన తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు కాశ గంగాధర్ మైనార్టీ మాజీ కో అప్షన్ మెంబర్ మహమ్మద్ అలీ? కస్తూరి హరి కిరణ్ గాదె అంజనేయులు నలుగొండ రాజీ రెడ్డి ఉస్కెమల్ల సత్యం పబ్బా ప్రభాకర్ లక్ష్మణ్ మస్కం ఆంజనేయులు చెవులమద్ది లచ్చయ్య చిర్ర చంద్రయ్య చిర్ర భూధవ్వ నిర్వాహకులు పబ్బా రఘు గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ ను బాధితుడికి అప్పగించిన పోలీసులు



**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) ఏప్రిల్ 23 :**
ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బోడ కుల్దీప్ ఈ నెల ఆదివారం ఫోను ఎక్కడో పడిపోయిందని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ పోర్టల్ లో వివరాలను నమోదు చేయడం జరిగింది. అయితే ఆ బాధితుడు పోగొట్టుకున్న తన ఫోనును బుధవారం ట్రేస్ అవుట్ చేసి అతడికి అప్పగించడం జరిగింది. ఎవరైనా వారి ఫోన్ పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలను సిఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేస్తే తిరిగి ఆ మొబైల్ ఫోన్ ను పొందే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి, ఎవరికైనా మొబైల్ ఫోన్లు లేదా ఇతర విలువైన వస్తువులు దొరికితే వాటిని సమీప పోలీస్ స్టేషన్లో అప్పగించాలని ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

## చట్టాన్ని అతిక్రమించే స్కానింగ్ సెంటర్ లపై చర్యలు





**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 23 :**
పిసీపిఎన్డీటీ చట్టాన్ని అతిక్రమించి గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ నిర్వహించి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలిపే స్కానింగ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. రాజశ్రీ హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని మూడు డివిజన్ లలో ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా రిజిస్టర్ చేయకుండా పరీక్షలు నిర్వహిస్తే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీపీ ఎన్డీటీ చట్టం ప్రకారం ప్రతి స్కానింగ్ చేసే వారకి విధిగా రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. ఫాం ఎఫ్ మెయింటేన్ చేయాలని, ఒకవేళ వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వారికి స్కానింగ్ నిర్వహిస్తే పూర్తి వివరాలు నమోదు చేయాలని అన్నారు. యోగ్యత కలిగిన వైద్యులు మాత్రమే స్కానింగ్ చేయాలని, ఇతరులు ఎవరైనా చేస్తే ఆ స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో రెండు ఆసుపత్రులలో కొత్త స్కానింగ్ యంత్రాలకు అనుమతినిస్తూ బోధన్ లోని ఒక స్కానింగ్ యంత్రం ఉన్న ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పిఓ ఎంసీహెచ్ డా. సుప్రియ, గైనకాలజిస్ట్ డా.బిందు, రేడియాలజిస్ట్ డా.శ్రావణి, పిడియాట్రిషియన్ డా.హరిప్రియ, డ్రగ్ ఇన్స్ పెక్టర్ శ్రీలత, సీడీపీఓ సౌందర్య, ఎన్జీవో పద్మాసింగ్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ గర్వపడేలా పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం

**- ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్ (మన వెలుగు) ఏప్రిల్ 23 :** ప్రజలందరూ గర్వపడేలా పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణం లోని ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్ నగర్ పట్టణం నడిబొడ్డున ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ గా హౌస్ ప్రాంగణంలో గత ప్రభుత్వం వెజ్ నాన్ వెజ్ మార్కెట్ మార్కెట్ గా ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల పైన ఒత్తిడి తెచ్చి కొంత నిర్మాణం చేసి, మధ్యలోనే నిర్మాణపు పనులను ఆపివేశారని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో విజ్ఞానాన్ని అందించే అధునాతన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. అందుకే గత 15 నెలలు గా ఎంతో మంది అధికారులను ఒప్పించి మెప్పించి ఈ నెల 16 వ తేదిన కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గారు నాలెడ్జ్ సెంటర్ కోసం జీఓ జారీ చేశారని ఆయన తెలిపారు. నాలెడ్జ్ సెంటర్ కోసం 17 కోట్లు కేటాయించారని, ముందుగా 10 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 17 కోట్లు రూపాయలతో ఇక్కడ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ స్థాయి లైబ్రరీ స్థాపిస్తామని, అందులో సెమినార్ హాల్స్, రీడింగ్ రూమ్స్, డిజిటల్ హాల్స్, క్లాస్ రూం లు తో ఒక మంచి అహ్లాదకరమైన వాతావరణం కల్పించి లక్ష పుస్తకాలు ఇక్కడ ఉండేవిధంగా అధునాతన లైబ్రరీ ఏర్పాటు చేయాలనే తన సంకల్పం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కూడా విద్యకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (గ్రంథాలయం ) అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయంగా ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో కళాశాలు, పాఠశాలలు , కోచింగ్ సెంటర్లు, హాస్టల్స్ ఉన్నాయని, అందుకే విజ్ఞాన కేంద్రంగా ఈ ప్రదేశం అందరికీ ఉపయోగపడుతుంది అని ఆయన చెప్పారు. అలాగే మెట్టు గడ్డ ప్రాంతంలోని డైట్ కళాశాల




ప్రాంగణంలో టిడి గుట్ట వెజ్ నాన్ వెజ్ మార్కెట్ గా నామకరణం చేసి అక్కడ నిర్మాణం చేస్తుంటే , విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేశారని, డైట్ కళాశాల స్థలం లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఏమిటి అని విద్యార్థులు ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు. అందుకే అక్కడ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తిని ఇచ్చిన వారు జ్యోతి బా పూలే , బాబా సాహెబ్ అంబేద్కర్ గారు అని, ఆంగ్లేయులు పరిపాలిస్తున్న కాలంలో దేశంలో కేవలం 5% అక్షరాస్యత ఉన్న సమయంలో తన ఆస్తులను అమ్మి 28 పాఠశాలలను ఏర్పాటు చేశారని , అలాగే దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బాబా సాహెబ్ అంబేద్కర్ గారు చదువు విలువ తెలిసిన వారని అందుకే వారి పేర్లను విజ్ఞాన కేంద్రానికి పెట్టడం జరిగింది అని ఆయన స్పష్టం చేశారు. త్వరలో ఈ పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, గుండా మనోహర్, శ్రీనివాస్ యాదవ్, మండల ఓబిసి సెల్ చైర్మన్ రాజు గౌడ్, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బోరు మోటార్ ను మరమ్మతు చేయించిన మాజీ కౌన్సిలర్ మీర్ తహేర్ అలీ





వేసివి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు చేపట్టడానికి ఎల్లప్పుడు అందుబాటులో వుంట్షానని 14 వ వార్డు మాజీ కౌన్సిలర్ సమీన మీర్ తాహేర్ అలి అన్నారు. పరిగి మున్సిపల్ 14 వ వార్డు ఖాన్ కాలనీ,మందుల కాలనీ లో నీటిని అందించే బోరు మోటార్ బుదవారం కాలిపోవడంతో మీర్ తాహేర్ అలి వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బంది సహాయముతో మోటార్ ను మరమ్మతు చేయించి తిరిగి కాలనీలో నీటి సరఫరా అయ్యే విధంగా చేశారు.దీనితో కాలనీ వాసులు తమ కు నీటి కష్టాలు లేకుండ చేసినందున మాజీ కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కోళ్ల నరసింహ, గణేష్, సాయలు, పద్మమ్మ, కాశం వెంకటేష్, అంజమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడి అమానుషం మైనార్టీ నాయకులు మీర్ మహమ్మద్ అలీ

ఉగ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం అత్యంత బాధాకరమని మైనార్టీ నాయకులు మీర్ మహమ్మద్ అలీ అన్నారు. వారు మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడి ఘటనను అన్ని కోణాల్లో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదానికి బలి అయిన అమాయకుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనలో సయ్యద్ ఆదిల్ హుస్సేన్ ఉగ్రవాదులతో పోరాడి భారత పర్యటకులను రక్షించే ప్రయత్నం చేసి ఈ ప్రయత్నంలో ఉగ్రవాదుల చేతిలో బలైపోయాడని ఆయన పేర్కొన్నారు.మానవత్వం మరిచి హిందూ ముస్లిం అనే తేడా లేకుండా ఉగ్రవాదులు అందరిని చంపారని పేర్కొన్నారు.మతాల మధ్య రాజకీయాలు చేయకుండా వాస్తవాలను పరిశీలించి ఉగ్రవాదులను అంతమొందించే లక్ష్యం భారత్కు ఉండాలని అన్నారు.ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని కోరారు.ఈ సమయంలో వాస్తవాలను పక్కదారి పట్టించకుండా నిజాలను నిర్భయంగా వెలికి తీసి ఈ సంఘటనకు కారణమైన ఉగ్రవాదులను అత్యంత కిరాతకంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదానికి కులం మతం లేదని భారతీయులను చంపడమే లక్ష్యంగా వాళ్ళు వచ్చినట్టు కనిపిస్తుందని దేశంలోకి అడుగుపెట్టి అమాయకులను అత్యంత పాషవికంగా చంపిన ఉగ్రవాదాన్ని రూపుమాపాలని కోరారు. భారతదేశంలో ఆర్మీ వెంట అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని అందరూ ముక్త కంఠంతో ఉగ్రవాదాన్ని నశింపజేయడమే కోరుతున్నారని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ

# పాశవిక దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

**- టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్**

**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 23 :** ఆహ్లాదకరమైన వాతావరణంలో, రమణీయ ప్రకృతిని ఆస్వాదిస్తూ.. ఆదమరచి ఉన్న పర్యాటకులను ఉగ్రముకలు తుపాకులతో విరుచుకుపడి, కాల్చివేయడం అత్యంత హేయమైన చర్య అని, ఇంతటి పాశవిక దాడికి పాల్పడ్డ ఉగ్ర దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ అన్నారు. బుధవారం హైదరాబాదు నుండి చరవాణి ద్వారా మెట్పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడారు. వారం క్రితం వివాహం చేసుకొని హనీమూన్ కు పహాల్గం వెళ్లిన వినయ్ సర్వాల్ దంపతులపై మృత్యువు ఉగ్రదాడి రూపంలో వారి బంధాన్ని ముక్కలు చేయడం, భర్త మృతదేహం ముందు భార్య విలపించే దృశ్యం.. యావత్ దేశాన్ని



కలచివేసిందని కరంచంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన

## దొంగతనం కేసులలో నిందితునికి 4 నెలల,11 రోజుల జైలు శిక్ష

**- 400 రూపాయల జరిమానా**

**జగిత్యాల రూరల్ (మన వెలుగు) ఏప్రిల్ 23 :** పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలపల్లి,జాబితాపూర్ గ్రామాల్లో గల కొత్త రాజరాజేశ్వర స్వామి, లలిత పరమేశ్వరి ఆలయంలలో 2024 సంవత్సరం అక్టోబర్ నెలలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఆలయానికి సంబంధించిన నగలు ఇతర వస్తువులు దొంగలించారు అని ఆలయ పూజారులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తన సిబ్బందితో కలిసి దొంగతనాలు చేసిన నిందితుడు వడ్లూరి నాగరాజు (32) తాటిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచడం జరిగింది. కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజిని తమ వాదన వినిపించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి 4 నెలల, 11 రోజులు జైలు శిక్ష, మరియు 400 రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి శ్రీనిజ కొహిర్కర్ తీర్పునిచ్చారు.

## తార్నాక డివిజన్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న ఎక్స్ కార్పొరేటర్ ఆళ్లకుంట హరి సరస్వతి

ఈ నెల 27వ తేదీన జరిగే భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి పార్టీ పిలుపు మేరకు మరియు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా డివిజన్ బస్తీలో బస్తీ కమిటీ నాయకులు జెండా ఎగురవేసి ఉదయం 11 గంటల వరకు వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆలకుంట హరి మాట్లాడుతూ కేసీఆర్ ప్రసంగం కోసం యావత్ దేశం ఎదురుచూస్తుందని అన్నారు కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు కేసీఆర్ సభను విజయవంతం చేయడానికి ప్రజలు తన ఇంటి పండుగగా



భావించి సభకు రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు ఈ కార్యక్రమానికి డివిజన్ వార్డు మెంబర్ యాదగిరి, ఎర్ర నాగు. మహిళా ప్రెసిడెంట్ స్టాలిన్, సమేత, ఇంద్ర, మంజుల, కె విజయ, నాగేశ్వరరావు, వినోద్ కుమార్, మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**మండల విద్యాధికారి నీరజ**

మెదక్ జిల్లా చేగుంట మండల్ చందాయి పెట్ ప్రభుత్వ పాఠశాలలో, మంగళవారం రాత్రి ఘనంగా ఆన్యువల్ డే సెలబ్రేషన్ జరిగాయి, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి నీరజ హాజరయ్యారు, ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు,, ప్రవేట్ పాఠశాలకు దిటుగా ఉన్నాయని, విద్యార్థిని,విద్యార్థులు, చేసినటువంటి సాంస్కృతి కార్యక్రమాలు, డాన్సులు , నాటికలు చూస్తుంటే ఇవి కేవలం పెద్దపెద్ద కార్పొరేట్ స్కూల్లోనే జరుగుతాయి, కానీ మన మండలంలో ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కిషన్, విట్టల్ రెడ్డి, నర్సింలు, సలీం, , గిరిధర్, ,సిద్ధిరములు,శ్రీనివాస్, బంగారయ్య, వీణ, స్వప్న, సౌజన్య, శంకర్, రాములు, దామోదర్, విద్యార్థి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు






## మహేష్ కుమార్ గౌడ్ గారిని కలిసిన త్రికాల మనోజ్ కుమార్





తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంలో పలు విషయాలు గురించి మాట్లాడి అడిగి తెలుసుకున్నాము. దానికి మహేష్ కుమార్ గౌడ్ గారి దగ్గర నుండి మంచి స్పందన వచ్చింది. సనత్ నగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం అలాగే రాంగోపాల్ పేట్ డివిజన్ లో అన్ని కార్యక్రమాలు వేగవంతంగా జరగాలని విజ్ఞప్తి చేసాము.
ఈ కార్యక్రమంలో త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ సనత్ నగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు. పంచముఖి హనుమాన్ టెంపుల్ చైర్మన్ బచ్చు రాజ్ కుమార్, డిసిసి సెక్రెటరీ ఏమన్ సింగ్ ఠాకూర్, మరియు రాంగోపాల్ పేట్ డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేహల్గామ్ ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేస్తోంది....

**పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**




జమ్మూ కాశ్మీర్ పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచివేస్తోందని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అన్నారు.ఈదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేస్తోందనీ ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఐక్యంగా ఉందాం మన భారత ఐక్యతను ఏ ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదు. ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా చూడాలి. సమష్టిగా మనం దీన్ని అధిగమిద్దాం అని అన్నారు. కలిసికట్టుగా ఉందాం ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది అని పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి తెలిపారు.ఈ ఉగ్రదాడిని ఖండిస్తూ చనిపోయిన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు.ఉగ్రవాదులను అంతమొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మారుతి సుజుకి షో రూమ్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



పరిగి మున్సిపల్ పరిధిలో హైదరాబాదు రోడ్డులో బుధవారం నూతనంగా ఏర్పాటుచేసిన మారుతి సుజుకి షోరూం ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి.ఈ సందర్భంగా షోరూం యజమానానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతు ముదిరాజ్, పాలాది శ్రీనివాస్, లక్న పురం శ్రీనివాస్, మంచన్పల్లి శ్రీనివాస్, రాములు, శ్రీశైలం యాదవ్ , లక్ష్మణ్ ,షో రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ నరమేధంపై చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి

## దాడిని ఖండిస్తూ నటీనటుల పోస్ట్







పహల్గాం లో మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది క్షమించరాని క్రూరమైన చర్య అని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే తన హృదయం బరువెక్కుతోందని ఎన్టీఆర్ తెలిపారు. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేక పోతున్నానంటూ జాన్వీకపూర్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతి తెలియజేస్తూ అల్లు అర్జున్ పోస్ట్ పెట్టారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రకృతి అందాలను చూసి పరవశిస్తోన్న వారిపై పాశవికంగా దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టకున్నారు. ఈ పెనువిషాదంపై సినీప్రముఖులు స్పందిస్తున్నారు. దాడిని ఖండిస్తూ మృతులకు సంతాపం తెలుపుతున్నారు. దీనిపై వీడియో చేస్తూ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కన్నీరు పెట్టుకున్నారు. ఇది మాటలకు అందని విషాదమన్నారు. ఇది క్షమించరాని చర్య అని చిరంజీవి పోస్ట్ పెట్టారు. 28 మంది అమాయకులను బలిగొన్న దారుణమైన ఈ దాడి హృదయ విదారకమైనది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. వారి నష్టం తీర్చలేనిదని చిరంజీవి అన్నారు. బాధితులను చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. శాంతి కోసం ప్రార్థిస్తున్నా అని ఎన్టీఆర్ అన్నారు. ఇది క్షమించరాని చర్య. ఈ ఉగ్ర చర్యపై అందరూ మౌనం వీడండి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. వారికి తగినవిధంగా బుద్ధి చెప్పాలని సంజయ్‌దత్ అన్నారు. ఈ దాడి భయంకరమైనది. అమాయకులను చంపడం చాలా దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నానని అక్షయ్ కుమార్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి గురించి తెలిసి దిగ్భ్రాంతి చెందాను. నా హృదయం బరువెక్కింది. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నా. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా. మేమంతా మీ వెంట ఉన్నాం. ఈ బాధ నుంచి కోలుకునే ధైర్యాన్నివ్వాలని దేవుడిని వేడుకుంటున్నాని జాన్వీ కపూర్ పేర్కొన్నారు. అమాయక పర్యటకులపై జరిగిన పిరికిపంద ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు. ఈ దుర్మార్గపు చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని సోనూసూద్ తెలిపారు. పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఈ దాడి గురించి తెలిసి నా గుండె పగిలిపోయింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. మృతి చెందిన అమాయకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అల్లు అర్జున్ తెలిపారు.

# ‘కల్కి 2’ రిలీజ్ ఎప్పుడు?.. నాగ్ అశ్విన్ ఫన్నీ రిప్లై



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ‘కల్కి 2898 ఏడీ’ . గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకొని కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో దీని సీక్వెల్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నాగ్ అశ్విన్ ‘కల్కి 2’ రిలీజ్‌పై ఫన్నీ రిప్లై ఇచ్చారు.‘కల్కి 2’ ఎప్పుడు రిలీజ్ చేస్తారని అడగ్గా.. “కల్కి’ని 3, 4 గ్రహాలు ఒకే వరుసలో ఉన్నప్పుడు విడుదల చేశాను. దాని సీక్వెల్‌ను 7, 8 గ్రహాలు ఒకే వరుసలోకి వచ్చినప్పుడు రిలీజ్ చేస్తా. వేచి ఉండండి’ అని ఫన్నీగా స్పందించారు. ప్రస్తుతం ఆయన రిప్లై వైరల్‌గా మారింది. ఇక ఇటీవల కూడా ఆయన ‘కల్కి 2’పై స్పందించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పార్ట్ 2లో ప్రభాస్ ఎక్కువసేపు స్క్రీన్‌పై కనిపిస్తారని.. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుందని తెలిపారు. రెండో భాగంలో వీరిద్దరి పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు.వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వనీదత్ ‘కల్కి 2898 ఏడీ’ చిత్రాన్ని నిర్మించారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. ఇందులో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు.

# హిట్-3 ప్రమోషన్‌లో నాని బిజీ




టాలీవుడ్ హీరో నాచురల్ స్టార్ నాని ప్రస్తుతం ఒక వైపు నిర్మాతగా సినిమాలు తెరకెక్కిస్తూనే మరొకవైపు హీరోగా వరుసగా సినిమాల్లో నటిస్తున్నాడు. అందులో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం 'హిట్ 3'. గతంలో విడుదల అయిన రెండు సినిమాలకు కొనసాగింపుగా దీనిని తెరకెక్కించారు. హిట్ ఫ్రాంచైజీలో తొలి రెండు చిత్రాలు ఇన్వెస్టిగేషన్ తరహాలో తీస్తే, ఇప్పుడు రాబోతున్న 'హిట్ 3' మాత్రం యాక్షన్, రక్తపాతం అనేలా తీశారు. ఇప్పటికే పిల్లలు సినిమా చూసేందుకు రావొద్దని నాని క్లారిటీ కూడా ఇచ్చేశారు. అయితే మే 1న పాన్ ఇండియా లెవెల్ లో ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా, గత కొద్ది రోజులుగా సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా బిజీ బిజీగా ఉన్నారు నాని. వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటు మూవీకి సంబంధించిన విషయాలు పంచుకుంటున్నాడు. ఇందులో భాగంగా తాజాగా ఓ మీడియాతో ముచ్చటించిన నాని దర్శకుడు శైలేష్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'శైలేష్ ఫస్ట్ షెడ్యూల్‌లో చాలా మొహమాట పడేవాడు. అన్నింటికీ నన్ను మెంటార్‌లా చూసి అన్నీ నన్ను అడిగేవాడు. నన్నేం అడగకు అని ఒక్కసారి గట్టిగా క్లాస్ పీకాను. నీకు మంచి సినిమా సెన్స్ ఉందని చెప్పాను. అప్పటి నుంచి రెచ్చిపోయాడు' అని నాని చెప్పుకొచ్చాడు. ఇకపోతే హిట్ 3 లో నాని హీరోగా నటించడంతో పాటు- నిర్మాతగా కూడా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఇక ఈ మూవీతో కూడా నాని సక్సెస్ సాధిస్తాననే నమ్మకంగా ఉన్నారు. ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే నాని నమ్మకం నిజమయ్యేలా కనిపిస్తుంది.

## హరిహరవీరమల్లు కోసం పవన్ డేట్స్ త్వరగా పూర్తి చేసే పనిలో యూనిట్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రజంట్ ఇటు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే.. ఒప్పుకున్న సినిమాలను ఒక్కోక్కటిగా పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఇందులో భాగంగా అత్యంత ఆలస్యం అవుతున్న సినిమా అంటే 'హరిహర వీరమల్లు'. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసి ఐదేళ్లు దాటింది. ప్రకటించిన కొన్ని నెలలకే షూట్ కూడా మొదలుపెట్టారు. కానీ రెండు భాగాలుగా అనుకున్న ఈ చిత్రంలో పార్ట్-1 కూడా పూర్తి కాలేదు. పలుమార్లు షూటింగ్‌కు బ్రేక్ పడుతూనే.. మధ్యలో దర్శకుడు కూడా మారారు. దీంతో ఇప్పుడంతలో ఈ సినిమా రిలీజ్ కాదని పవన్ అభిమానుల్లో నిరాశ మొదలైంది. కానీ తాజాగా ఓ న్యూస్ వైరల్ అవుతుంది.. సమాచారం ప్రకారం 'హరిహర వీరమల్లు' కోసం పవన్ కాల్ షీట్స్ కేటాయించాడట. మేలో ఇంకొన్ని రోజుల్లోనే పవన్ షూట్‌కు హాజరు కానున్నాడట. ఆయనో పది రోజులు వరుసగా చిత్రీకరణకు వస్తే బ్యాలెన్స్ షూట్ అంతా అయిపోతుంది. మాట అయితే ఇచ్చాడు కానీ పవన్ వచ్చే వరకు ఏదీ గ్యారెంటీ- లేదు కాబట్టి కొత్త రిలీజ్ డేట్ ప్రకటించడం లాంటిదేమీ చేయట్లేదు చిత్ర బృందం. ఇక ఈ సినిమాలో అందాల భామ నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోండగా బాబీ డియోల్, నోరా ఫతేహి ఇతర ముఖ్య పాత్రపోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఏఎం.రత్నం ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

# క్రిష్ ఘూటిని కూడా వదిలేశాడా?



టాలీవుడ్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి టాలెంట్ గురించి మనకు తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ఏ మూవీ అయిన ప్రేక్షకుల మదిలో అలా నిలిచిపోతాయి. ఏ దర్శకుడు టచ్ చేయని కాన్సెప్టులతో క్రిష్ పలు సినిమాలు తెరకెక్కించాడు. కానీ ప్రస్తుతం క్రిష్ -టైమింగ్ బాలేదు. ముందుగా పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో 'హరిహర వీరమల్లు' చిత్రం తెరకెక్కించగా,ఈ మూవీతో క్రిష్ జాతకం మారిపోవడం ఖాయం అని అనుకున్నారు. 9 నెలల్లో ఈ ప్రాజెక్ట్ ని పూర్తి చేద్దామని స్పీడ్ మీద ఉన్న క్రిష్.. ఫస్ట్ హాఫ్ ని చాలా తొందరగా పూర్తి చేశారు. కానీ మధ్యలో కరోనా, లాక్ డౌన్ అంటూ గ్యాప్ వచ్చింది. ఇక అంత క్లియర్ అయిన టైంలో క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నాడు.. ఇక ఈ మూవీ నుండి తప్పుకున్న తర్వాత అనుష్కతో 'ఘాటి' మొదలు పెట్టాడు. గత ఏడాది టీజర్ కూడా విడుదల చేసి మూవీపై భారీ అంచనాలు పెంచాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ కూడా మూవీపై ఆసక్తి కలిగేలా చేసింది. అయితే ఈ చిత్రాని ఏప్రిల్ 18న రిలీజ్ చేయబోతున్నట్టు మేకర్స్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఈ సినిమా పరిస్థితి అయోమయంగా మారింది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేస్తారనే దానిపై క్లారిటీ కూడా లేకుండా పోయింది. అంతే కాదు ప్రేక్షకుల్లో కొత్త అనుమానాలు మొదలయ్యాయి. ఏంటంటే ఈ మూవీ కూడా మధ్యలో ఆగిపోయిందా?, లేకపోతే క్రిష్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నాడా? అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అసలు క్రిష్ సినిమాలకే ఎందుకు ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంతకు ముందు కూడా బాలీవుడ్ లో ఆయన 'మణికర్ణిక' వంటి చారిత్రాత్మక చిత్రాన్ని మొదలు పెట్టి, మధ్యలో వెళ్ళిపోయాడు. మిగిలిన సినిమా కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. 'హరిహర వీరమల్లు'ని మధ్యలోనే వదిలిపెట్టేశారు. ఇక ఇప్పుడు ఘాటీని కూడా మధ్యలోనే వదిలేశారా అన్న ప్రశ్న తలెత్తుతుంది